క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారికి ఆలయ నిర్మాణకర్తలు బోడసింగి జగదీశ్వరరావు, బోడసింగి జగ్గునాయుడు దంపతులు తొలిపూజ చేశారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

రికార్డులు పక్కాగా నిర్వహించాలి



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: గ్రామ సచివాలయాల్లో అన్ని రికార్డులు పక్కాగా నిర్వహించాలని సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీఓ ఎస్.హరిహరరావు సూచించారు. మండలంలోని ముద్దూరు సచివాలయాన్ని బుధవారం ఆయ న సందర్శించారు. రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ కార్యాలయ ఏఓ సుదర్శనం

గజపతినగరం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ పర్యవేక్షణలో బుధవారం సాదాసీదాగా జరిగింది. సమావేశానికి అన్ని శాఖల అధికారులతో పాటు, ఎంపీటీసీ సభ్యులు హాజరైనప్పటికీ సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎలాంటి అంశాలపై చర్చ లేకుండానే సభ్యుల ఆమో దంతో సమావేశం ముగించారు. మండల పరిషత్ కార్యాలయ ఏఓ పి.సుదర్శనం మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అభివృద్ధి పనులకు తీర్మానాలు చేయడానికి, సమస్యలపై చర్చించడానికి అవకాశం లేదని తెలిపారు. ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, వైస్ ఎంపీపీ గెద్ద దమయంతి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో క్విజ్ పోటీలు



క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న లైబ్రేరియన్ ఉషారాణి

చీపురుపల్లిరూరల్(గరివిడి): వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గరివిడి శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం.ఉషారాణి ఆధ్వర్యంలో విద్యా ర్థులకు బుధవారం క్విజ్ పోటీలు నిర్వ హించారు. విద్యార్థులను గ్రూపులుగా విభజించి కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ అంశాలపై క్విజ్ నిర్వ హించారు. అనంత రం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి, నీతి కథలు చదివించారు. విజేతలకు శిబిరం ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని చెప్పారు.

పంపిణీకి సిద్ధంగా వరి విత్తనాలు

దత్తిరాజేరు: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండల రైతులకు రాయితీపై పంపిణీ చేసేందుకు వరి విత్తనాలను సిద్ధం చేశామని ఏఓ అనురాధ తెలిపారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాలకు వరి విత్తనాలను చేరవేశామని చెప్పారు. ఎంటీయు-1121 రకం విత్తనా లతో పాటు మరి కొన్ని రకాలు విత్తనాలు 2,700 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు సచివాలయాల్లో వీఏఏల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

లక్కవరపుకోట: స్థానిక, మల్లివీడు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యు త్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఐ.కృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లలో మెయింటెనెన్స్ పనులు చేపట్టను న్నట్లు పేర్కొన్నారు. ఈనేపథ్యంలో ఖాసాపేట,ఎల్.కోట తలారి, కొట్యాడ, రంగరాయపురం, సంతపేట, మల్లివీడు, గంగుబూడి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం



వేపాడ: బల్లంకిలో ఉపాధి వేతనదారులకు ఉపాధి పనులపై అవగాహన కల్పిస్తున్న ఏపీడీ శారదా దేవి



దత్తిరాజేరు: షికారుగంజిలో ఫారం పాండ్ పనులను పరిశీలిస్తున్న ఏపీఓ వెంకటఅప్పలనాయుడు



వేపాడ: ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఏపీడీ శారదాదేవి

వేపాడ: ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్లతోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని, రైతులకు అవగాహన కల్పించి, సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉపాధి హామీ పథకం ఏపీడీ శారదా దేవి సూచించారు. స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఏపీఓ ఆదిలక్ష్మి సమక్షంలో ఉపాధి పనులపై బుధవారం సమీక్షించారు. ఈసంద ర్భంగా ఏపీడీ మాట్లాడుతూ గతంలో మెట్టు భూముల్లో పండ్లతోటల సాగుకు ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు, ఇతర పనులకు ప్రోత్సాహం అందించేవారమని, ఇప్పుడు పల్లం భూముల్లో సాగు చేసే వారికి కూడా ప్రోత్సా హం అందిస్తున్నామని చెప్పారు. కొబ్బరి,మామిడి, జీడి మామిడి, సపోట, జామి, సీతాఫలం, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, దానిమ్మ, మునగ రకాలను భూమిని బట్టి సాగుచేసుకోవచ్చన్నారు. సాగుకు ఆసక్తి గల రైతులను గుర్తించాలని ఆదే శించారు. అలాగే ప్రతీ గ్రామంలో ఫారం పాండ్ల తవ్వకాల పనులు చేయించాలని, మామిడి తోటల్లో మొక్కల చుట్టూ గట్లు ఎత్తే పనులు, సరిహద్దుల కందకాల పనులు ఎక్కువగా చేయాలన్నారు. సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఫారం పాండ్‌ల పనుల పరిశీలన

దత్తిరాజేరు: వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భజలాలను పెంపొందించేందుకు ఫారం పాండ్‌లు ఎంతో దోహదపడతాయని ఉపాధి హామీ పథకం ఏపీఓ వెంకటఅప్పల నాయుడు అన్నారు. మండలంలోని షికారు గంజి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా వేతనదారులు చేపడుతున్న ఫారం పాండ్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న వారే పనుల కు హాజరు కావాలని, ఒకరికి బదులు వేరొకరు పనులకు రాకూడదన్నారు. పని ప్రదే శంలో టెంట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

వేపాడ: ఫీల్డ్ అసిస్టెంట్లు ఇచ్చిన కొలతల ప్రకారం ఉపాధి పనులు చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ వేతనం అందుతుందని ఎస్.కోట ఏపీడీ శారదా దేవి అన్నారు. బల్లంకి, నీలకంఠరాజపురం గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా వేతనదారులతో మాట్లాడుతూ రెండుపూటలా పనులు చేయాలన్నారు. ఎండలతీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 6: 30 గంటలకు పనులు ప్రారంభించి 11 గంటలకు ముగించాలని, మధ్యాహ్నం ఎండ తీవ్రత తగ్గిన తర్వాత పనులకు హాజరు కావాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఆమె వెంట ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు.

ముగిసిన శ్యామలాంబ పండగ



బందోబస్తు నిర్వహించిన పోలీసులను అభినందిస్తున్న డీఎస్పీ చక్రవర్తి



ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్న ధీర ఫౌండేషన్ సభ్యులు

గుర్ల: మండలంలోని దమరసింగి గ్రామంలో మూడురోజుల పాటు నిర్వహించిన గ్రామదేవత శ్యామలాంబ పండగ బుధవారంతో ప్రశాంతంగా ముగిసిందని చీపురుపల్లి డీఎస్పీ చక్రవర్తి తెలిపారు. పండగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించిన ఎస్ఐ భాస్కరరావు, పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు. గ్రామంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ధీర ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్ తమ ఫౌండేషన్ తరఫున ట్యాంకుల ద్వారా మూడురోజులూ నీటిని సరఫరా చేశారు.

వీరభద్రపేట మాజీ సర్పంచ్ మృతి



వెంకట రమణమూర్తి(ఫైల్)



వెంకటరమణమూర్తి మృతదేహం వద్ద సంతాపం తెలుపుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: వీరభద్రపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు, న్యాయవాది ఏడువాక వెంకటరమణమూర్తి(65) అనారోగ్యం తో బుధవారం తన స్వగృహంలో మృతి చెందారు. ఈయన గత కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడు తూ చికిత్స తీసుకుంటున్నారు. ఆరోగ్యం విషమించడంతో మృతిచెందారు. ఈయన వీరభద్రపేట పంచాయతీకి రెండు పర్యాయాలు సర్పంచ్‌గా, కాంగ్రెస్ పార్టీ ఎల్.కోట మండల అధ్యక్షుడిగా పనిచేశారు. మృతుడికి భార్య సుశీల, కుమారుడు ఉన్నారు. వెంకటరమణమూర్తి మృతి సమాచారం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివా సరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ నాయకులు వీరభద్రపేట వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

షటిల్ క్రీడాకారుల ట్రెక్కింగ్



పుణ్యగిరి కొండపై షటిల్ క్రీడాకారులతో కోచ్ శ్రీరాములు

శృంగవరపుకోట: ధర్మవరం ఉన్నత పాఠశాల, ఎస్.కోటలోని నారాయణ కేంబ్రిడ్జ్ పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి బ్యాడ్మిం టన్ శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న 118 మంది క్రీడాకారులతో కలిసి చీఫ్‌కోచ్ పి.శ్రీరాములు పుణ్యగిరి కొండపైకి బుధవారం ట్రెక్కింగ్‌కు వెళ్లారు. పర్వతాలను ఎలా అధిరోహించాలి, శ్వాససమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు శ్రీరాములు వివరించారు. ట్రెక్కింగ్ వల్ల శారీరక ధృడత్వం, కండరాల ధారుడ్యం వృద్ధి చెందుతాయని తెలిపారు.

గోస్తనీ నది వద్ద హెచ్చరిక బోర్డులు



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

జామి: జామి-జాగరం ఆనకట్టవద్ద గోస్తనీనదిలో ముగ్గురు విద్యార్థులు మంగళవారం మునిగిపోయి మృతి చెందారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతం వద్ద బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రమాదాలు సంభవించే ప్రదేశమని, పర్యాటకులు ఎవరూ ఈప్రాంతానికి రావద్దని హెచ్చరిక బోర్డుల్లో సూచించారు. ప్రమాదాలు సంభవించకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ వీరబాబు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

గంట్యాడ: సార్వత్రిక ఎన్నికల కోడ్ ఇంకా అమలులో ఉందని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని విజయ నగరం రూరల్ సీఐ శ్రీనివాస రావు పేర్కొన్నారు. మండలంలోని నరవ, నందాం గ్రామాల్లో ప్రజలతో బుధవారం సాయంత్రం ఆయన సమావేశమయ్యారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా ప్రశాంత వాతావరణంలో ముగిసేలా ప్రజలంతా సహకరించాలని కోరారు. ఫలితాల రోజును పార్టీల వర్గాలు, నాయకులు, కార్యకర్తలు గొడవలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామివారి తిరువీధిలో కలశాలతో మహిళలు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి కొండంపేట గ్రామంలో గల అయ్యప్పస్వామి దేవాలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు ఆరవెల్లి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవతో పాటు పంచామృతాభిషేకాలు, పుష్పాలంకరణ, గోపూజ, నవగ్రహ, క్షేత్రపాలక, వాస్తు, యోగిని మండల మంటప ఆవాహనాలు, అర్చనలు, త్రిపూర్వక సూర్యనమస్కారాలు, మహన్యాసపూర్వక మహాలింగార్చనలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్, ఆలయ ధర్మకర్త ముద్దన సత్యారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 4 వేల మందికి అన్నసమారాధన చేపట్టారు. సాయంత్రం తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్, రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షులు వాకముళ్ల చిన్నారావు, యాలాల వెంకటేష్, ఆర్నెపల్లి వెంకటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

1న రామనారాయణంలో హనుమాన్ జయంతి

విజయనగరం రూరల్: సారిక సమీపంలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన రామనారాయణంలో వచ్చే నెల 1న హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు లక్ష తమలపాకులు, కనకాంబరాలు, సింధూరంతో సాముహిక సహస్ర నామార్చనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాత్రి 7 గంటలకు 60 అడుగుల అభయాంజనేయ స్వామికి మహా హారతి కార్యక్రమం, లేజర్ షో ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

శ్రీనివాసుడికి ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్: మండల పరిధి దుప్పాడ గంగనగర్‌లోని శ్రీ క్షేత్రంలో కొలువైన అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీనివాసునికి బుధవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయం అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యుల వేదమంత్రాల నడుమ స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ధర్మకర్తలు దుర్గా బాలాజీ, ఉమాదేవి దంపతులు, నీరజ మన్నే, భక్తులు పాల్గొన్నారు.

చురుగ్గా ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే



చీపురుపల్లి: చీపురుపల్లిలో ఇంటింట సర్వే చేస్తున్న భవిత కేంద్రం సిబ్బంది



వేపాడ: ఆకులసీతంపేటలో సర్వే చేస్తున్న సిబ్బంది

చీపురుపల్లి: భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు బడి ఈడుకు వచ్చిన ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే మండలంలో చురుగ్గా సాగుతోంది. చీపురుపల్లి పట్టణంలో భవిత కేంద్రం సిబ్బంది బుధవారం ఇంటింట సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా సీఆర్ఎంటీ కె.రామకృష్ణ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ప్రభుత్వం భవిత కేంద్రాలను నిర్వహిస్తోందని, ఈకేంద్రాల సేవలను పిల్లలు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు సహక రించాలని కోరారు. శారీరకంగా, మానసికంగా వైకల్యం కలిగిన పిల్లలకు వివిధ రూపాల్లో విద్యను అందించి సాధారణ విద్యార్థు లుగా తీర్చిదిద్దేందుకు భవిత కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈకేంద్రాల్లో ఆటపాట లతో కూడిన విద్య అందించేందుకు ప్రభుత్వం ఎంతో వెచ్చించి ప్రత్యేక తరగతి గదులను ఏర్పాటు చేసింద న్నారు. పిల్లలు ఇళ్లలోనే ఉండిపోవడం ద్వారా వారిలో మానసిక వికాసం ఉండదన్నారు. భవిత కేంద్రాలకు పంపించి వారిలో మనో చైతన్యం కలిగించేందుకు తల్లిదండ్రులు సహకరించా లన్నారు. ఇంతవరకు మండలంలో 18 మంది ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించినట్లు చెప్పారు. ఐఈఆర్టీ త్రినాథరావు పాల్గొన్నారు.

16 మంది గుర్తింపు

వేపాడ: ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి (దివ్యాంగులు) బడిబాట పట్టించేందుకు మండలంలో ఇంటింట సర్వే నిర్వహిస్తున్నామని ఎంఈఓ బాలభాస్కరరావు తెలిపారు. మండలంలోని ఆకుల సీతంపేట గ్రామంలోఐఈఆర్టీలు ఎన్ సత్యవతి, సీహెచ్ జయంత్ తదితరులు బుధవారం సర్వే నిర్వహించారు. ఎంఈఓ బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు పెదగుడిపాల, వావిల పాడు, వీలుపర్తి, వెల్దాం, సీహెచ్‌డీ అగ్రహారం, డి.ఆర్.పేట, బానాది, బల్లంకి, నీలకంఠరాజపురం, ఏ.ఎస్.పేట, శింగరాయి, జగ్గయ్యపేట, అరిగిపాలెం, సోంపురం, పాటూరు, బొద్దాం, కొండగంగుబూడి గ్రామాల్లో సర్వే నిర్వహించి 16 మంది ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించా మని స్పష్టం చేశారు. జూన్9 వరకు సర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు. గుర్తించిన పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించి విద్యాబోధనతో పాటు ఫిజియోథెరపీ సేవలు అందించనున్నామని వివరించారు. అంధులు, మూగ, చెవిటి,మానసిక వైకల్యం ఉన్న పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని, ఈ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోందని చెప్పారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

వేపాడ: రైతులకు 50 శాతం రాయితీపై పంపిణీ చేసేందుకు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని ఏఓ సి.బి.యశ్వంతరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీలుగ విత్తనాలు 22.40 క్వింటాళ్లు, జనుము 19.30 క్వింటాళ్లు ఉన్నాయని,10 కిలోల ప్యాకెట్‌ను రాయితీపై రూ.440కు అందించనున్నట్లు పేర్కొన్నారు. పిల్లిపెసర విత్తనాలు 3.38 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని 8 కిలోల ప్యాకెట్‌ను రాయితీపై రూ.536కు అందిస్తున్నామని వివరించారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు



మాట్లాడుతున్న సీఐ ఎన్.వి.ప్రభాకరరావు

గజపతినగరం: గజపతినగరం సర్కిల్ పరిధిలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా సహకరించిన పోలీస్ సిబ్బందికి, ఎస్ఐలకు, మీడియా ప్రతినిధులు, ప్రజలకు, ప్రతి ఒక్కరికీ పోలీస్ శాఖ తరఫున స్థానిక సీఐ ఎన్.వి.ప్రభాకరరావు కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ స్టేషన్ వద్ద పోలీస్ సిబ్బంది, మీడియా ప్రతినిధుల ఆత్మీయ సమావేశం బుధవారం రాత్రి నిర్వ హించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గజపతి నగరం సర్కిల్ పరిధిలో ఒకటి రెండు చోట్ల తప్ప అన్ని గ్రామాల్లోనూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. ముందుగానే సమస్యాత్మక గ్రామాలను గుర్తించి, తగాదాలు రాకుం డా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. గజపతినగరం, మానాపురం, ఆండ్ర, బూర్జవలస, బొండపల్లి ఎస్ఐలు పాల్గొన్నారు.

సరదాల మాటున ప్రమాదం..

- వేసవి సెలవుల్లో పిల్లలను ఓ కంట కనిబెట్టాలి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్య నిపుణులు



క్రికెట్ ఆడుతున్న పిల్లలు



సైకిల్ తొక్కుతున్న విద్యార్థులు

రామభద్రపురం: వేసవి తాపం తీవ్రంగా ఉంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎక్కడ చూసినా వడగాడ్పులు వీస్తున్నాయి. వేసవి సెలవులు కావడంతో పిల్లలు ఆటపాటలతో ఆనందంగా గడుపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చిన్నారులు సందడి కనిపిస్తోంది. ఎవరికి ఇష్టం వచ్చిన ఆటలు వారు ఆడుతూ సరదాగా గడిపేస్తున్నారు. అయితే ఈ సరదాల వెనుక ప్రమాదాలు దాగుంటాయని పిల్లల కదలికలపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉండాలని వైద్యనిపుణులు చెబుతున్నారు. అలవాట్లు, ఆహారం, ఆరోగ్యం, చదువు తదితర అంశాలను ప్రణాళికాబద్ధంగా రూపొందించుకుంటే వారి మేధస్సుకు పదును పెట్టిన వారమవుతామని సూచిస్తున్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఖాళీగా ఉండడం ఇష్టం లేక వీలైనంత వరకు తోటి స్నేహితులతో సరదాగా గడపాలని చూస్తారు. ఆటపాటల్లో గడిపేందుకు ఉత్సాహం చూపిస్తుంటారు. ఆటలు, ఈత శారీరక వ్యాయామంగా మంచిదే అయినప్పటికీ ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదన్న విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలి.

బోర్ ఫీలవ్వకుండా...

ఇంట్లో ఖాళీగా ఉంటే పిల్లలు బోర్‌గా ఫీలయ్యే అవకాశం ఉంటుంది. వారికి కొత్త ఆటలు నేర్పించాలి. విజ్ఞానాన్ని పెంచే అంశాలపై దృష్టి సారించేలా చూడాలి. ఉదయం 6 గంటల నుంచి 7.30 వరకు.. సాయంత్రం ఎండ తగ్గిన తర్వాత ఆడుకునేలా చూడాలి. ఇండోర్ ఆటలు ఆడుకునేలా వసతులు కల్పించాలి. ఎండల్లో ఎక్కువగా తిరిగితే వడదెబ్బకు గురయ్యే ప్రమాదముంది.

ఆరోగ్యంపై ఉష్ణోగ్రతల ప్రభావం..



వేసవిలో సాధ్యమైనంత వరకు పిల్లలు మధ్యాహ్నం పూట ఎండలో తిరగకుండా చూడాలి. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. శీతల పానీయాలు కంటే కొబ్బరిబొండాం, తాజా పండ్ల రసాలు తీసుకోవడం మేలు. వడదెబ్బ తగిలితే ఓఆర్ఎస్ తాగించి దగ్గర్లోని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించాలి.

– సీహెచ్ మాధురి, ప్రభుత్వ వైద్యాధికారి

ఆటల్లో తర్ఫీదు ఇప్పించాలి..



పిల్లలకు చదువు ఒక్కటే కాదు. ఆటలు కూడా ముఖ్యమే. ఇందుకోసం వేసవి శిక్షణ కేంద్రాలున్నాయి. వాటిని వినియోగించుకోవాలని. అయితే పిల్లలను ఓ కంట కనిబెట్టకపోతే ప్రమాదకరమైన ఆటలాడి ప్రాణాల మీదకు తెచ్చుకునే అవకాశం ఉంది. వీలైనంతవరకు ఇండోర్ గేమ్స్ ఆటుకోవడానికే ప్రాధాన్యం ఇవ్వాలి.

– బి. రత్నకిషోర్, పీడీ, ఉన్నత పాఠశాల, కొట్టక్కి

వాహనాలతో జాగ్రత్త...

చిన్నతనం నుంచే పిల్లల్లో ఆత్మస్థైర్యం నింపాలి. సముద్రాలు, నదులు, కాలువల్లో కొట్టుకుపోకుండా, తనంతట తానే బయటపడే విధంగా ఈత నేర్పాలి. అలాగే సైకిల్, ద్విచక్రవాహనాలు నేర్చుకోవాలన్న కోరిక పిల్లల్లో సహజంగానే ఉంటుంది. వయస్సు ఆధారంగా సైకిల్ మాత్రమే నేర్పించాలి. కొంత మంది పిల్లలు ఇంట్లో చెప్పకుండా మోటారు సైకిళ్లు తీసుకువెళ్తుంటారు. బైక్‌ల తాళాలు వారికి అందుబాటులో ఉంచకూడదు.